ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
మంగళవారం 2 జనవరి 2024







సీఎంను కలిసిన మంత్రులు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో మంత్రి సీతక్క కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటాన్ని బహుకరించారు. ఇక రాజభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారితో సెల్ఫీ దిగారు.

ఉత్సాహంగా... ఉల్లాసంగా..

న్యూ ఇయర్ వేడుకల్లో ఫుల్ జోష్



భూపాలపల్లిలో న్యూ ఇయర్ వేడుకల్లో డ్యాన్స్ేస్తున్న స్థానికులు

భూపాలపల్లిటౌన్, జనవరి 1: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను జిల్లాలో సోమవారం ఆనందోత్సవాల నడుమ నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఈ వేడుకలు అంత్యంత ఘనంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. బాణసంచా కాల్చి కేరింతలు పెడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. పలుచోట్ల కాలనీల్లో డీజేలు పెట్టుకుని డ్యాన్సులు వేశారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా యువత రోడ్లపై తిరుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్సైలు కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వెలసిల్లాలని ఆకాంక్షించారు. పలువురు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

● కాటారం : మండలంలో నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రజలు 2023కి వీడ్కోలు పలికి 2024 సంవత్సరానికి స్వాగతం పలికారు. మహిళలు వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి అలంకరించారు. ప్రజలు ప్రార్థన మందిరాలు, ఆలయాలకు వెళ్లి కొత్త ఏడాదంతా బాగుండాలని దేవుడిని వేడుకున్నారు. పోలీస్ సబ్‌డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. కాటారం సీఐ రంజిత్‌రావు, మహదేవపూర్ సీఐ కిరణ్‌కుమార్, పలువురు ఎస్సైలతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నేతలు తమ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. విందులు, వినోదాలతో న్యూ ఇయర్ సెలెబ్రేషన్స్ హంగామా మండల వ్యాప్తంగా కనిపించింది. ఈ కార్యక్రమాల్లో సబ్ డివిజన్ ఎస్సైలు అభినవ్, సుధాకర్, నరేష్, లక్ష్మణ్‌రావు, రాజ్‌కుమార్, తమాషారెడ్డి, ప్రసాద్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుగుణ, సమ్మిరెడ్డి, మహేశ్వరి, విజయారెడ్డి, రఘురాం, శ్రీహరి, తిరుపతిరెడ్డి, కిరణ్, గౌరక్క,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● తాడ్వాయి : మండల వ్యాప్తంగా ప్రజలు ఆంగ్ల సంవత్సరాది నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చిలు, దేవాలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో పిల్లాపాపలతో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు, పూజలు నిర్వహించారు. దీంతో గ్రామాల్లోని సందడి నెలకొంది. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండాలని, ఆయురారోగ్యాలతో ఉండాలంటూ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విష్ యూ హ్యాపీ న్యూఇయర్ అంటూ హిందూ, ముస్లిం, క్రైస్తవ మతాల తారతమ్యం లేకుండా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల్లో ఇళ్లముందు వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వెలిశాయి. యువజన, మహిళా సంఘాల ఆద్వర్యంలో కేక్‌లు కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు. తాడ్వాయి, కాటాపూర్, గంగారం, బీరెల్లి, రంగాపూర్, లింగాల, కామారం, తదితర గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకున్నారు. మండల ప్రజలకు వివిధ రాజకీయపార్టీల ప్రతినిదులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

● ఏటూరునాగారం : నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. మండలంలోని ఆకులవారిఘణపురం, రామన్నగూడెం, రాంనగర్, రొయ్యూరు, శంకరాజుపల్లి, ముల్లకట్ట, రాంపూర్, ఎక్కెల, తాళ్లగడ్డ తదితర గ్రామాల్లో న్యూ ఇయర్ వేడుకల సందడి కనిపించింది.



ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయం

పాలన గాడిలో పడేనా..?!

- ఐటీడీఏలో ప్రక్షాళన జరిగేనా..
- పూర్వ వైభవం దిశగా అడుగులు పడేనా..!
- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు
- బతుకులు మారాలంటున్న గిరిజనులు

ఏటూరునాగారం రూరల్, జనవరి1: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పాలన అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. కొన్నేళ్లుగా పాలకుల నిర్లక్ష్యానికి ఐటీడీఏ గురైంది. కాలక్రమేణా తన వైభవాన్ని కోల్పోతూ వస్తోంది. నిధులలేమి, శాఖల తరలింపు తదితర కారణాలతో ఐటీడీఏ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యంతోపాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన ఐటీడీఏ ప్రాధాన్యత తగ్గుతూ వస్తోందని తెలుస్తోంది. దశాబ్దాలుగా గిరిజనుల జీవన ప్రమాణాలు అనుకున్నంత స్థాయిలో మెరుగుపడకపోవడానికి ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని ఆయా సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన పాలక మండలి సమావేశాలు మచ్చుకైనా లేకపోవడం దారుణమని గిరిజన సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019లో చివరిసారిగా జరిగిన సమావేశం ఊసు మళ్లీ కనిపించలేదు. అసలు దాని గురించి పాలకులు పట్టించుకున్న దాఖలాలు లేవని అంటున్నారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఐటీడీఏకు పూర్వ వైభవం తెస్తుందని గిరిజనులు ఆశిస్తున్నారు. ఐటీడీఏను సమూలంగా ప్రక్షాళన చేసి గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపాలని ఆయా సంఘాలు కొత్త సర్కారును కోరుతున్నాయి.

ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 ఏజెన్సీ మండలాలు ఉన్నాయి. 177 ఏజెన్సీ గ్రామాలు ఉన్నాయి. ఐటీడీఏ పరిధిలో సుమారు లక్ష 25 వేల జనాభా ఉంది. ఈ ప్రాంతాల్లో ఐటీడీఏ పర్యవేక్షణలోనే పాలన కొనసాగుతోంది. ఆయా గ్రామాల్లో 90శాతం అభివృద్ధి పనులు దీని ద్వారానే చేపట్టాల్సి ఉంటుంది. అయితే.. ఐటీడీఏ పట్ల గత పాలకులు నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో క్రమేణా దాని ప్రాధాన్యం తగ్గుతూ వస్తోంది. ముఖ్యంగా నాలుగేళ్లుగా పాలక మండలి సమావేశాలు జరగకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందని గిరిపుత్రులు అంటున్నారు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం ఐటీడీఏ పాలనపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ఇందుకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేయాలంటున్నారు. గాడి తప్పిన పాలనను దారికి తెచ్చి గిరిజనుల్లో ఐటీడీఏపై భరోసాను పెంచాలని అంటున్నారు. నిధుల కేటాయింపుతోపాటు ఉద్యోగ ఖాళీల భర్తీకి కృషి చేయాలని కోరుతున్నారు.

అధికారుల ఇష్టారాజ్యం

ఐటీడీఏలో అధికారులు ఏళ్ల తరబడి తిష్ట వేసి ఉన్నారు. ఐదేళ్లుగా బదిలీలు లేక ఉన్నతాధికారులు ఒకేచోట విధులు నిర్వర్తిస్తున్నారు. ఏపీవో, ఏవో వంటి కీలకస్థాయి అధికారులకు సైతం స్థానచలనం లేకపోవడంతో పాలనంతా ఇష్టానుసారంగా మారిందని పలు గిరిజన సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఒకచోట పనిచేయడంతో పాలననలో పారదర్శక లోపించిందని అంటున్నారు. దీనికితోడు ఐటీడీఏ ఉన్నతాధికారుల్లో గ్రూపు రాజకీయాలు బలంగా ఉండడంతో పాలనపై ప్రభావం పడుతోందని విమర్శిస్తున్నారు. దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. అంతేకాకుండా ఐటీడీఏలోని విద్య, వైద్యం, ఇంజనీరింగ్ విభాగాల్లో భారీగా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆ విభాగాల అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నరనే విమర్శలు ఉన్నాయి. ఇంజనీరింగ్ శాఖలో ఈ ఏడాది డీఈ, ఏఈలు ఐటీడీఏ కార్యాలయంలోనే లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం కలకలం సృష్టించింది. దీర్ఘకాలంగా విధుల్లో ఉన్న అధికారులను వెంటనే వారిని బదిలీ చేసి వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవాలని గిరిజన సంఘాలు ఈ క్రమంలో పలుమార్లు డిమాండ్ చేశాయి.

పథకాల అమలు ఎన్నడో..?

గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం ఐటీడీఏ ద్వారా చేపడుతున్న పథకాల అమలు నత్తనడకన సాగుతున్నాయి. గిరిజనులకు ఆర్థిక వెసులుబాటుతోపాటు ఉపాధికి ఊతమిచ్చే ఎకనామికల్ సపోర్ట్ స్కీం(ఈఎస్ఎస్) పనితీరు అధ్వానంగా మారింది. గిరివికాసం, డ్రైమిక్స్ యూనిట్, సబ్బుల తయారీ పరిశ్రమ, రూరల్ ట్రాన్స్‌పోర్టేషన్ స్కీం, బ్యూటీషియన్ స్కీం తదితర పథకాలు గిరిజనులకు సకాలంలో చేరువ కాక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఈ పథకాల అమలును వేగవంతం చేయాలని గిరిజనులు కోరుకుంటున్నారు.

ఆశలన్నీ మంత్రిపైనే..



కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఐటీడీఏను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి గిరిజనులకు మేలు జరగేలా కార్యాచరణను సిద్ధం చేయాలని పలు గిరిజన సంఘాలు కోరుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర గిరిజన అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కపై గిరిజనులు గంపెడాశలు పెట్టుకున్నారు. ఐటీడీఏకు నిధుల కేటాయింపుతోపాటు ఖాళీలను భర్తీ చేసి ఐటీడీఏ పాలనన గాడిన పెట్టాలని కోరుతున్నారు. ఐటీడీఏకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా మంత్రి అడుగులు వేయాలని అంటున్నారు. భారీ స్థాయిలో నిధులను కేటాయించి ఐటీడీఏ బలోపేతానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏటూరునాగారంలో ఉద్రిక్తత

- బైరి నరేష్‌ను అడ్డుకున్న అయ్యప్ప స్వాములు
- భీమాకోరేగావ్ స్ఫూర్తి దినోత్సవంలో పాల్గొన్న నరేష్
- నాస్తికవాదాన్ని ప్రోత్సహించొద్దని భక్తుల ఆగ్రహం
- తీవ్ర వాగ్వాదం.. స్వల్ప తోపులాట
- ఓ భక్తుడి కాలిపై నుంచి దూసుకెళ్లిన నరేష్ కారు
- జీడివాగు వద్ద చెట్టును ఢీకొన్న వాహనం
- కారు దిగి పరారైన నరేష్, ఆయన అనుచరులు





నరేష్ వాహనాన్ని అడ్డుకుంటున్న అయ్యప్ప భక్తులు,
గాయపడిన భక్తుడిని ఆస్పత్రికి తరలిస్తున్న అయ్యప్ప స్వాములు

ఏటూరునాగారం రూరల్/ఏటూరునాగారం, జనవరి1 : నాస్తికవాదంపై అయ్యప్ప భక్తుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దేవుళ్లపై అనుచితంగా వ్యాఖ్యలు చేస్తే సహించబోమని నిరసనకు దిగారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలో సోమవారం జరిగిన ఓ సమావేశానికి హాజరైన నాస్తికవాది బైరి నరేష్‌ను అయ్యప్ప భక్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకొని ఉద్రిక్తతకు దారి తీసింది.

ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భారతీయ నాస్తిక సంఘం ఆధ్వర్యంలో భీమాకోరేగావ్ స్ఫూర్తి దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా బైరి నరేష్ హాజరయ్యారు. విషయం తెలుసుకున్న అయ్యప్ప భక్తులు అక్కడికి చేరుకున్నారు. నాస్తిక వాదాన్ని ప్రోత్సహించే ఇలాంటి సమావేశాలు నిర్వహించొద్దని అడ్డుకున్నారు. గతంలో మీరు అయ్యప్ప భక్తుల మనోభావాలు దెబ్బతినేలా నరేష్ మాట్లాడారని, మళ్లీ అలాంటి దుశ్చర్యలకు పాల్పడేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నారని విమర్శించారు. దీనిపై నరేష్ మాట్లాడుతూ ఈ సమావేశంలో అలాంటి వ్యాఖ్యలేవీ ఉండబోవని స్పష్టం చేశారు. అయినా అయ్యప్ప భక్తులు శాంతించలేదు. వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని నరేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో గొడవలు సృష్టించేందుకే ఇక్కడకు వచ్చావని కోపోద్రిక్తులయ్యారు. దీంతో సమావేశాన్ని నిర్వహించి తీరుతామని నరేష్ తేల్చి చెప్పడంతో వాగ్వాదం మరింత తీవ్ర రూపం దాల్చింది. సమాచారం అందుకొని అక్కడికి చేరుకున్న పోలీసులు సమావేశాన్ని రద్దు చేసుకోవాలని నరేష్‌కు సూచించారు. దీంతో ఆయన అయిష్టంగానే కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు.

అయ్యప్ప భక్తుడికి గాయాలు

సమావేశాన్ని రద్దు చేసుకొని బయటకు వచ్చిన నరేష్ కారు ఎక్కి వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. అయినా అయ్యప్ప భక్తులు కారుకు అడ్డంగా వచ్చి నిరసన తెలిపారు. ఈ క్రమంలో కారును డ్రైవర్ ముందుకు కదలించగా పోగు నరసింహరావు అనే భక్తుడి కాలికి గాయమైంది. అయినా నరేష్ ఆగకుండా అక్కడి నుంచి కారులో మంగపేట వైపు వెళ్లిపోయారు.

ప్రమాదానికి గురైన కారు

ఏటూరునాగారం నుంచి తన అనుచరులతో బయల్దేరిన బైరి నరేష్ కారు జీడీవాగు సమీపంలోని కొమురంభీంనగర్ వద్ద చెట్టును ఢీకొని ప్రమాదానికి గురైంది. వాహనంలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడం పెను ముప్పు తప్పింది. బైరి నరేష్‌తోపాటు డ్రైవరు, మరో ఇద్దరు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. కారు ప్రమాదానికి గురైనట్టు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఏటూరునాగారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కారును స్వాధీనం చేసుకొని బైరి నరేష్‌తోపాటు ఆయన అనుచరులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఇదే క్రమంలో బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అయ్యప్ప భక్తులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. గాయపడిన నరసింహరావును ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు చేసిన పోలీసులు

అయ్యప్ప భక్తుల ఫిర్యాదు మేరకు బైరి నరేష్ మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపారు. మంగపేట వైపు అతడు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురైందని, ఇది జరిగిన వెంటనే బైరి నరేష్‌తో పాటు వాహనంలో ఉన్న మరో ముగ్గురు అక్కడి నుంచి పారిపోయారని చెప్పారు. కారును స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని అన్నారు.



బైరి నరేష్‌తో వాగ్వాదం చేస్తున్న అయ్యప్ప భక్తులు



ప్రమాదానికి గురైన నరేష్ కారును పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

హైదరాబాద్ పటాన్‌చెరువు సమీపంలో ఘటన

బాధితులు జనగామ జిల్లా వాసులు



పాకాల నితిన్ (ఫైల్)



భరత్‌చందర్ (ఫైల్)

బచ్చన్నపేట/పాలకుర్తి, జనవరి 1: హైదరాబాద్ పటాన్‌చెరువు నోవాపాన్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జనగామ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామానికి చెందిన పాకాల నితిన్ (18), పాలకుర్తి మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన రాగం భరత్‌చందర్ (19) సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వంశీ అనే మరో విద్యార్థితో కలిసి వీరు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ తెచ్చేందుకు స్కూటీపై వెళుతున్న క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. దీంతో భరత్‌చందర్‌తో పాటు నితిన్ అక్కడికక్కడే మృతి చెందగా వంశీ తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరిలో నితిన్ తండ్రి ఏడాది క్రితం మృతి చెందగా, తల్లి సంతోష కూలి పనులు చేస్తూ నితిన్‌ను చదివిస్తోంది. ఇక భరత్‌చందర్ తల్లిదండ్రులకు ఏకైక కుమారుడు. ఇద్దరు అక్కలు ఉన్నారు. తల్లిదండ్రులు రాగం రాజన్నరజిత దంపతులది వ్యవసాయ కుటుంబం. రెక్కల కష్టాన్ని నమ్ముకొని కష్టపడి పిల్లలను చదివిస్తున్నారు. కుటుంబానికి ఆధారంగా నిలుస్తాడనుకున్న కుమారుడు అకాల మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోస్టుమార్టం అనంతరం వీరి మృతదేహాలు సోమవారం సాయంత్రం స్వగ్రామాలకు చేరుకునే అవకాశం ఉంది.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

వాట్సాప్ స్టేటస్ పెట్టి బలవన్మరణం



కుసుమ నరేష్ (ఫైల్)

కాటారం, జనవరి 1: ఓ యువకుడు ఉరి వేసుకున్నారు. ఆత్మహత్య చేసుకోబోతున్నానని వాట్సాప్ స్టేటస్ పెట్టి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అందరూ నూతన సంవత్సర వేడుకల్లో మునిగి ఉండగాభూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం...

కాటారం మండలం రేగులగూడెం గ్రామ పంచాయతీ పరిధి దేవరాంపల్లికి చెందిన కుసుమ నరేష్(28) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. బీఆర్ఎస్ కార్యకర్తగా కొనసాగుతున్నాడు. ఏదో పని ఉందని ఆదివారం బయటకు వెళ్లిన నరేష్ సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఏదో ఫోన్ రావడంతో మాట్లాడుకుంటూ మళ్లీ బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో స్నేహితులతో ఉన్నాడేమోనని కుటుంబసభ్యులు భావించారు. ఇంతలో నరేష్ సెల్‌ఫోన్‌లో తాను చనిపోతున్నట్లు వీడియోస్టేటస్ పెట్టాడని కొందరు గ్రామస్థులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు, పలువురు యువకులు నరేష్ కోసం గ్రామం చుట్టుపక్కల వెతికారు. రెండు గంటల అనంతరం అర్ధరాత్రి ధన్వాడ ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొని ఉన్నట్టు గుర్తించారు.

నరేష్ ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. నరేష్ అవివాహితుడు. అతడికి తల్లితోపాటు అన్న ఉన్నాడు. కొన్నేళ్ల క్రితం తండ్రి మృతి చెందాడు.

పెళ్లి కావడం లేదని బలవన్మరణం



ప్రశాంత్ (ఫైల్)

వాజేడు, జనవరి 1: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటుచేసుకుంది. పేరూరు ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన తొర్రెం సరోజిని, సత్యం దంపతులకు రెండో సంతానం ప్రశాంత్(28). ఇతడికి వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ఏడాది కాలంగా సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నారు. తనకు పెళ్లి కాదేమోనని మనస్తాపంతో ప్రశాంత్ ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ప్రార్థనల నిమిత్తం చర్చి వద్దకు వెళ్లి తిరిగి వచ్చే సరికి విగతజీవిగా వేలాడుతూ కనిపించాడు. సమాచారం అందుకున్న పేరూరు ఎస్సై రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. తండ్రి సత్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.










మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కేసుల నమోదు

దామెర, జనవరి 1: దామెర మండల పరిధిలో డిసెంబరు 31న అర్ధరాత్రి వరకూ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై దామెర పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి వరకూ వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన 22మందిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఎక్కడా కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా దామెర పోలీస్ స్టేషన్ ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారని ఎస్సై తెలిపారు.











ధర్మసాగర్ ఎస్సీకాలనీ పల్లెబండ వద్ద నిల్వచేసి తరలిస్తున్న మట్టి

అక్రమంగా మట్టి దందా

- ప్రభుత్వ భూములే లక్ష్యంగా కొనసాగిస్తున్న వ్యాపారులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- చర్యలు తీసుకోవాలంటున్న ఆయా గ్రామాల ప్రజలు

ధర్మసాగర్, జనవరి 1 : పచ్చని పంటలు పండే భూముల్లో నుంచి అక్రమంగా మట్టిని తరలించడంతో వ్యవసాయ భూములు పనికి రాకుండా పోతున్నాయి. ధర్మసాగర్ మండలం ముప్పారం, నర్సింగరావుపల్లి, నారాయణగిరి, ఎలుకుర్తి గ్రామాలలోని ప్రభుత్వ భూముల్లో నుంచి వ్యాపారులు రాత్రి పది గంటల నుంచి తెల్లవారి ఐదు గంటల వరకు మట్టిని నిరంతరం తరలిస్తున్నారు. పోలీసుస్టేషన్‌కు, తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ధర్మసాగర్ పెట్రోల్ బంక్ వద్ద నిత్యం ఎక్స్‌వేటర్స్, టిప్పర్లు ప్రతీ రోజు నిలిపి వేస్తూ రాత్రి వేళలో మట్టి రవాణా చేస్తున్నారు. ప్రభుత్వం రైతుల ఉపాధి కోసం పంపిణీ చేసిన భూముల్లో పది నుంచి పదిహేను ఫీట్ల లోతు వరకు మట్టిని తీసి తరలించడంతో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోతున్నాయి. ఇటీవల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ వారి దందా మాత్రం నిలిపి వేసిన నాథుడే లేడు. ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి, ముప్పారం, నారాయణగిరి, రాపాకపల్లి, ధర్మసాగర్, దేవునూర్, శాయిపేట్, మల్లక్‌పల్లి తదితర గ్రామాలలో మట్టి వ్యాపారం చేసే వ్యాపారులు పోలీసులను, రెవెన్యూ అధికారులను, మైనింగ్, విజిలెన్స్ అధికారులను ప్రతి నెల వ్యాపారులు ప్రసన్నం చేసుకోవడం వల్లనే ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టి రవాణాను నిలిపి వేయాలని పలుమార్లు అయా గ్రామాల ప్రజలు పోలీసులకు డయల్ 100కు సమాచారం అందించినా చర్యలు తీసుకున్న వారే లేరని పలువురు వాపోతున్నారు. రాత్రి వేళలో ధర్మసాగర్ పీఎస్‌కు అతి సమీపాన బ్రిక్స్ తయారీ కేంద్రం, ఎస్సీ కాలనీ పల్లెబండ, ఎలుకుర్తికి వెళ్లే దారి వద్ద, ఎలుకుర్తి కోళ్లఫామ్‌ల వద్ద మూడు చోట్ల, కరుణాపురం రింగ్ రోడ్డు బ్రిడ్జి ఎడమ వైపు రెండు చోట్ల రాత్రి వేళల్లో మట్టిని నంబర్లు లేని టిప్పర్ల సాయంతో తరలించి నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి నగరానికి, వెంచర్లకు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ధర్మసాగర్ మండలంలో మట్టి రవాణాను నిలిపి వేసి వ్యవసాయ భూములను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వం పంపిణీ చేసిన ఎలుకుర్తి భూముల్లో నుంచి మట్టి తీసిన దృశ్యం

సైనికులు చట్టసభల్లో ఉండొద్దా?

- పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ హైకమాండ్లకు రిటైర్డ్ కల్నల్ లేఖ



రిటైర్డ్ కల్నల్ డాక్టర్ భిక్షపతి

జనగామ టౌన్, జనవరి 1: 'దేశ రక్షణలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనిచేస్తున్న సైనికులు రాజకీయాలకు పనికిరారా..? విపత్కర పరిస్థితుల్లోనూ నిబ్బరం కోల్పోకుండా దేశ రక్షణకు పనిచేసే సైనికులకు చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించగలరు.. పదవీ విరమణ పొందిన సైనికుల జ్ఞానం, అనుభవం ఇప్పుడున్న రాజకీయాలకు ఎంతో అవసరం.. వారికి చట్టసభల్లో ప్రాధాన్యం ఇచ్చే విషయంలో అన్ని పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలి..' అంటూ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి భావోద్వేగ లేఖ రాశారు. పదవీ విరమణ పొందిన సైనికుల తరుపున సోమవారం ఆయన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానాలకు ఓ లేఖ రాశారు. పొరుగు దేశాల నుంచి ఎలాంటి ముప్పు లేకుండా సైనికులు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. దేశ రక్షణ కోసం సియాచిన్, ద్రాస్, కార్గిల్ వంటి యుద్ధాల్లో పోరాడిన సైనికులు కేవలం ఉద్యోగాలకు మాత్రమే పరిమితమవుతున్నారని, వారికి చట్టసభల్లో అవకాశాలు కల్పిస్తే అవినీతి రహిత పాలన అందిస్తారని అభిప్రాయపడ్డారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ సైనికుల సమాఖ్య తరపున విజ్ఞప్తి చేస్తే ఎవరూ పట్టించుకోలేదని, త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లోనైనా జవాన్లకు పోటీ చేసే అవకాశాలను పార్టీ అధిష్టానాలు కల్పించాలని భిక్షపతి కోరారు.



ఆధార్ అప్‌డేషన్‌కు పరుగులు

• ఆరు గ్యారంటీలకు ఆధార్‌కార్డు తప్పనిసరి • పడిగాపులు కాస్తున్న ప్రజలు • కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

హనుమకొండ రూరల్, జనవరి 1 : కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తప్పనిసరి కావడంతో ఆధార్ సెంటర్ల వైపు ప్రజలు పరుగులు పెడుతున్నారు. ఆధార్ కార్డులో వయస్సు, చిరునామా తదితర మార్పులు చేయించుకుంటున్నారు. అయితే ఆధార్ తీసుకొని పది సంవత్సరాలు పూర్తయిన వారు తప్పనిసరిగా అప్‌డేషన్ చేసుకోవాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం సూచించిన విషయం తెలిసిందే. అందుకు గడువు కూడా రెండుసార్లు పొడిగించింది. అయినా చాలా మంది అప్‌డేట్ చేయించుకోలేదు. ఆధార్ కార్డుపై ఆంధ్రప్రదేశ్ అని ముద్రించి ఉన్నా ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నా ప్రజలు అప్‌డేషన్ కోసం ఆధార్‌సెంటర్లకు వెళుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేయాలంటే ఆధార్ అవసరం కావడంతో మీ సేవా కేంద్రాలు, ఆధార్ సెంటర్ల వైపు జనం పరుగులు పెడుతున్నారు.

సంక్షేమ పథకాలకు తప్పనిసరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ సంక్షేమ పథకాలు పొందాలంటే సంబంధిత లబ్ధిదారుల ఆధార్ నెంబరు అనుసంధానం తప్పనిసరి. ఈ క్రమంలో సంబంధిత ఆధార్‌కార్డుల్లో వివరాలు సరిగా ఉన్నాయా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. పది సంవత్సరాల క్రితం జారి చేసిన ఆధార్‌కార్డుల్లో సరైన వివరాలు లేకపోవడం, ఫొటో, మొబైల్ నెంబరు, చిరునామా తదితర వివరాలు సక్రమంగా నమోదు కాకపోవడంతో ఇతరత్రా కారణాలతో కార్డులు రిజెక్టు అవుతున్నాయి. దీంతో పింఛన్లు, రేషన్‌కార్డులు, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు, బ్యాంకు ఖాతాలు, కల్యాణలక్ష్మీ, రైతుబంధు, రైతుభీమా లాంటి అనేక సంక్షేమ పథకాలకు అర్హులైన వారు వాటికి దూరం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఆధార్‌కార్డును సరిచేసుకునేందుకు ప్రజలు ఆధార్ కేంద్రాల చుట్టు తిరుగుతున్నారు.

ప్రతీ పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలి

2016 సంవత్సరానికంటే ముందు ఆధార్‌కార్డు పొందిన ప్రతీ ఒక్కరూ తగిన గుర్తింపు పత్రాలతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. నెలల వయసు చిన్నారుల నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారుల వరకు విధిగా ఆధార్ నమోదు చేయించాలి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే అన్ని రకాల సరుకులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. 2010 నుంచి 2018 సంవత్సరాల మధ్య జారి అయిన ఆధార్‌కార్డు నమోదుదారులతోపాటు తండ్రి, భర్త విషయాలే ముద్రితమయ్యాయి. 2018 తర్వాత వాటి స్థానంలో చిరునామా మాత్రమే పేర్కొంటూ కార్డులను జారీ చేశారు. ఆధార్‌కార్డుల జారీ ప్రారంభంలో ఎలాంటి వివరాలు నమోదు చేయలేదు. ఎలాంటి వివరాలు ఆధార్‌లో లేకపోవడంతో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యేవి. ప్రస్తుతం ఆ వివరాలకు సంబంధించిన ధృవీకరణపత్రాలు పొందుపరుస్తూ పూర్తి వివరాలతో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకుంటే భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు.




కేయూ జంక్షన్‌లోని ఆధార్ కేంద్రంలో బారులుదీరిన ప్రజలు, హనుమకొండ డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో ప్రజలు

అన్నిటికి ఆధార్‌కార్డే ఆధారం

ప్రభుత్వ, ప్రయివేట్ శాఖల్లో ఏ చిన్న పని జరగాలన్నా ఆధార్‌కార్డును ప్రమాణికంగా తీసుకోవవడంతో ఆధార్ కీలకంగా మారింది. ఆధార్ కార్డుల జారిని కేంద్ర ప్రభుత్వం 2010 సంవత్సరంలో తీసుకురాగా, ఆధార్‌కార్డుల అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ సేవలు వినియోగించుకోవడానికి మారుమూల గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికి తోడు నూతనంగా ఆధార్ తీసుకునేందుకు ప్రజలు నానా ప్రయాసలు ఎదుర్కొంటున్నారు. మండలానికో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండల కేంద్రాల్లో మీ సేవా కేంద్రాలు, బ్యాంకులలో ఆధార్ సేవలు ఉన్నప్పటికీ వివిధ అవసరాల నిమిత్తం ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తుండటంతో ఆధార్ సేవలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. నూతనంగా ఆధార్‌కార్డులు పొందడం, మార్పులు, చేర్పులు చేసుకునేందుకు వ్యయప్రసాల కోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లినా ఆధార్ కేంద్రాల్లో జనం ఎక్కువ సంఖ్యలో ఉండటంతో వెనుదిరగాల్సి వస్తోంది.

కిటకిటలాడుతున్న జిరాక్స్ సెంటర్లు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రజలు పెద్ద ఎత్తున ప్రజాపాలన గ్రామ, వార్డు సభలకు తరలి వస్తున్నారు. దరఖాస్తు ఫారాల కొనుగోలు, వాటికి జత చేయాల్సిన ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులతోపాటు ఇతర ధృవీకరణ పత్రాల కోసం వచ్చిన ప్రజలతో జిరాక్స్ సెంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని ప్రాంతాల్లో ప్రజాపాలన దరఖాస్తులను అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



మల్లన్న ఆలయ గంగిరేగుచెట్టు ఆవరణలో భక్తజనసందోహం

కొమురవెల్లి మల్లన్న మూలవిరాట్టు దర్శనం నిలిపివేత

చేర్యాల, జనవరి 1 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి ఆలయంలో మల్లన్న కల్యాణం సందర్భంగా మూలవిరాట్టు దర్శనాన్ని సోమవారం సాయంత్రం నిలిపివేశారు. మూలవిరాట్టును సుందరీకరించనున్నందున గర్భాలయ ప్రవేశం, దర్శనాన్ని ఆపేశారు. భక్తుల కోసం ఉత్సవ విగ్రహాలను నెలకొల్పారు. ఈనెల 7న తెల్లవారుజామున దృష్టికుంభం నిర్వహించిన అనంతరం మూలవిరాట్టు దర్శనం ప్రారంభించనున్నారు. కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం సోమవారం భక్తులతో రద్దీగా మారింది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పొరుగు ప్రాంతాలకు చెందిన వందలాదిమంది భక్తులు తరలివచ్చారు. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రసాద విక్రయశాల వద్ద మహిళలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పురుషులు, స్త్రీలకు ప్ర త్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేయకపోవడంతో ఒకే క్యూలైన్‌లో నిలబడి తోపులాటతో తంటాలుపడ్డారు.

మల్లన్న స్వామికి మొక్కులు చెల్లించిన 'కడియం'



స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు

ఐనవోలు, డిసెంబరు 1: స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి దంపతులు ఐనవోలు మల్లికార్జునస్వామిని సోమవారం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడంతోపాటు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం కుటుంబసమేతంగా ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికి వేద ఆశీర్వచనాలతో పాటు పట్టువస్త్రాలు తీర్థప్రసాదాలు అందజేశారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, జడ్పీ వైస్‌చైర్మన్ గజ్జెలి శ్రీరాములు, స్థానిక సర్పంచ్ జన్ను కుమారస్వామి, జఫర్‌గడ్ సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, గర్మిళ్లపల్లి సర్పంచ్ గండి మల్లికాంబరమేష్, ఎంపీటీసీ కడుదురి రాజు, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు మునిగాల సంపత్‌కుమార్, వడిచర్ల శ్రీనివాస్, బుర్ర రాజశేఖర్, ఆడేపు దయాకర్, పెండ్లి తిరుపతి, పల్లకొండ సురేష్, తండ వెంకన్న, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం గిరిజనేతరుల రిలే దీక్ష



బయ్యారంలో రిలే దీక్ష చేస్తున్న గిరిజనేతరులు

బయ్యారం, జనవరి 1: షెడ్యూల్డ్ ఏరియాలోని ఏజెన్సీ ప్రాంతంలో నివసించే గిరిజనేతరులు హక్కుల కోసం బయ్యారంలో సోమవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఎస్సీ, బీసీ, ఓసీ, మైనారిటీ కులాలకు చెందిన వారు పలు రకాల ఇబ్బందులకు గురవుతూ ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తాతముత్తాతల నాటి నుంచి ఈ ప్రాంతంలో నివసిస్తూ ఓటు హక్కు కలిగి ఉన్నప్పటికి సాగు భూములపై హక్కులు లేకపోవడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు రాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఇకనైన ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరుల ఇబ్బందులు తొలిగిపోవాలంటే రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రజా, కుల సంఘాల నేతలు, యువత మద్దతు తెలపాలని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ జనసభ జిల్లా నాయకుడు చల్లా గోవర్దన్, బీసీ జిల్లా నాయకులు చీరాల జలేందర్, మందాటి శ్రీనివాస్, నూనె యాకయ్య, నూనె బసవయ్య, వెంకటమల్లు, సుధాకర్, లక్ష్మయ్య, బుచ్చయ్య, అఖిల్, మురళి, సంతోష్, లింగయ్య, నరేష్ పాల్గొన్నారు.

లౌకికవాద రాజ్య స్థాపనకై పోరాడుదాం

▸▸ ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు

మహబూబాబాద్ రూరల్, జనవరి 1: దేశంలో కులం, మత రహిత, తాడిత, పీడిత ప్రజా సమస్యలపై పోరాడి సాధించడమే అమరులకు మనమిచ్చే నిజమైన నివాళులని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలో సోమవారం ఎన్డీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సంద వెంకన్న సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. దేశంలో కులం, మతం పేరుతో పాలకులు ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ తరుణంలో విప్లవ శక్తులు ఏకమై కులమత రహిత తాడిత, పీడిత ప్రజల సమస్యలపై పోరాడి హక్కులను సాధించి పెట్టడమే అమరులకు మనం అర్పించే నిజమైన నివాళులన్నారు. వెంకన్న సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో ఎన్డీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, గుజ్జు దేవేందర్, మైస శ్రీనివాస్, ఎన్డీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, జడ సీతారామయ్య శివ్వారపు శ్రీధర్, శ్రీశైలం, బాబన్న, తాజ్‌పాషా, బట్టు చైతన్య, బోనగిరి మధు, పద్మ, సోమిరెడ్డి పాల్గొన్నారు.

సంస్థలను ధ్వంసం చేస్తున్న కేంద్రం : సీపీఐ



కంతాయపాలెం గ్రామంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

తొర్రూరు రూరల్, జనవరి 1 : రాజ్యాంగ సంస్థలను ధ్వంసం చేస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెప్పాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. తొర్రూరు మండలం కంతాయపాలెంలో గ్రామ శాఖ కార్యదర్శి మార్క సాంబయ్య అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటమే తమ ధ్యేయమని అన్నారు. కేంద్రంలో బీజేపీ మతం ప్రాతిపదికన దేశాన్ని పాలించాలని చూస్తుందని, లౌకిక ప్రజాస్వామ్యం నాటకమని తెలిపారు. దేశంలో ప్రజా సమస్యలు గాలికొదిలేసి రాముడి జపం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ ఒక్కరు మతోన్మాద, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, మండల కార్యదర్శి యాకూబ్, సోమిరెడ్డి, దర్గయ్య, సాయిమల్లు, ఉపసర్పంచ్ రాంమూర్తి, శంకర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్యాట్మింటన్ పోటీలకు కేయూ జట్టు ఎంపిక



ఎంపికైన జట్టుతో కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్, జనవరి 1 : కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి వీటీ యూనివర్సిటీలో జనవరి 2 నుంచి 5 వరకు నిర్వహించనున్న సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఉమెన్స్ బ్యాట్మింటన్ కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసి ప్రకటించినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పెద్దమళ్ళ శ్రీనివాసరావు సోమవారం ప్రకటించారు. 2023-24 సంవత్సరానికిగాను కాకతీయ యూనివర్సిటీ నుంచి జట్టు పాల్గొంటుందని వెల్లడించారు. ఎంపికైన వారిలో ఎస్.వర్షిత, వి.తనూశ్రీ, పి.లక్ష్మి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి, వరంగల్) జి.కీర్తన, ఎం.పూజరాగప్రియ (కేయూ ఇంజనీరింగ్ కళాశాల, హనుమకొండ)లు ఎంపికైనట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ పి.శ్రీనివాసరావు వెల్లడించారు. జట్టుకు కొత్తగూడెంలోని సింగరేణి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె.సావిత్రి మేనేజర్‌గా వ్యవహరిస్తారు. జట్టును కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావులు అభినందించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

వర్ధన్నపేట, జనవరి 1: ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని రెండవ వార్డు పరిధిలో ఉన్న రాజస్థాన్ వీధిలో ఎలాంటి రక్షణ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ అధికారులు తమకేమి పట్టనట్లుగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికితోడు ట్రాన్స్ ఫార్మర్ పిచ్చిమొక్కలు ఏపుగాపెరిగి ప్రమాదరంగా మారాయి. గతంలో ఇదే కాలనీకి చెందిన ఓ బాలుడు ట్రాన్స్‌ఫార్మర్ షాక్‌కు గురై గాయాల పాలు అయ్యాడు. ప్రాణాపాయం తప్పినప్పటికీ నివాస ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాడు చేయడం స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మళ్లీ యువత ఓటరు నమోదు ప్రారంభం

▸▸ మార్పులు, చేర్పులకు అవకాశం
▸▸ ఓటరు జాబితా సవరణకు ఆదేశాలు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 1: యువత 18 సంవత్సరాలు నిండి జనవరి 1 నుంచి ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం యువత ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించింది. జనవరి 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా, బూత్ లేవల్ స్థాయి అధికారుల వద్ద నమోదు చేసుకోవచ్చు. నూతన ఓటరు నమోదు కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ముసాయిదా జాబితాను ఈనెల 6న ప్రకటించనుంది. ఓటర్లు తమ ఓటరు ఐడీ కార్డుల్లో మార్పులు, చేర్పులు తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి ఫాం-6, ఫాం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. దరఖాస్తు చేసుకున్న వాటిని బూత్ లెవల్ స్థాయి అధికారులు పరిశీలించి అధికారులకు అందజేస్తారు. జనవరి 6న ముసాయిదాను ప్రకటించి అభ్యంతరాలు స్వీకరిస్తారు.



ఫిబ్రవరి 8న తుది జాబితా..

అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం వచ్చే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన యువతకు కేంద్ర ఎన్నికల సంఘం ఓటు హక్కు కల్పించడానికి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనుంది. అలాగే ఓటరు ఐడీ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి కూడా అవకాశం కల్పించింది. తప్పులు ముద్రణ జరిగినచో సరిచేసుకోవడానికి కూడా అవకాశం కల్పించారు. జనవరి 6న ముసాయిదా జాబితాను ప్రకటించి జనవరి 22 వరకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించనున్నారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను ప్రకటించే అవకాశం ఉంది.

ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలి..

నగరంతో పాటు జిల్లాలోని గ్రామాల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఒక ప్రత్యేక కార్యాచరణగా రూపొందించాల్సిన అవసరం ఉంది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జరుగనున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించి 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడానికి ఇంటింటా సర్వే ద్వారా కళాశాలల్లో వివరాలను సేకరించి ఓటరు నమోదు అవకాశం చేపట్టాలి. గతంలో ఓటరుగా ఉన్న చాలా మందికి ఓటరు ఐడీ కార్డులు పోస్టు ద్వారా పంపినట్లు అధికారులు తెలిపినా చాలా మందికి పోస్టల్ ద్వారా రాలేదు. చాలా సంవత్సరాల క్రితం నుంచి ఓటరు ఐడీ కార్డు ఉన్నవారికి కూడా ప్రస్తుతం ఉన్న ఫొటోతో ఐడీ కార్డు జారీ చేసేలా మీ సేవ కార్యాలయాల్లో అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.



ఓటరు నమోదు కోసం ఇంటింటికి..

జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు నూతనంగా ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవడానికి ఓటు హక్కు కోసం యువత దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల సంఘం యువతకు ఓటు హక్కు కల్పించడానికి డిసెంబరు 20 నుంచే జిల్లాలోని గ్రామాల్లో, నగరంలోని డివిజన్లలో బూత్ లెవల్ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తగా యువత ఓటు హక్కు కోసం ఫాం -6 ద్వారా నమోదు చేసుకోవాలి.

వావ్.. కొబ్బరిపువ్వు



పోషకాలమెండుతో పెరిగిన అమ్మకాలు

▸▸ నగరంలో ప్రధాన కూడళ్లలో విక్రయాలు
▸▸ కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగమతి

కరీమాబాద్, జనవరి 1: ప్రకృతి అందించే ఫలాలు మానవాళికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఒక్కో పండు ఒక్కో ప్రత్యేకతను చాటుతూ ఆరోగ్యదాయనిగా పేరుపొందాయి. అలాంటిదే కొబ్బరిపువ్వు. కొబ్బరికాయలో లోపల తెల్లని ముద్దగా ఉండేదే ఈ కొబ్బరిపువ్వు. కొబ్బరి పువ్వు దర్శనమిస్తే మంచి జరుగుతుందని ఎంతో మంది నమ్ముతారు. కాని ఇప్పుడు అదే కొబ్బరిపువ్వును తింటే ఆరోగ్యానికి మహాభాగ్యం అంటున్నారు. వాస్తవానికి కొబ్బరికాయలో నీరు ఇంకిపోయి కొబ్బరి ముదిరినప్పుడు పువ్వు ఏర్పడుతుంది. కొబ్బరినీళ్లు, కొబ్బరిలో లభించే పోషకాల కంటే ఈ పువ్వులోనే అధిక పోషకాలు లభిస్తాయని నిపుణులు అంటున్నారు.

నగరంలో అమ్మకాలు జోరు..

కొబ్బరి పువ్వు విక్రయాలు నగరంలో జోరందుకుంది. ప్రధాన కూడళ్లలో కొబ్బరిపువ్వు కౌంటర్లు ఏర్పాటు చేసి మరీ విక్రయిస్తున్నారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుండడంతో నగరవాసులు వాటిని ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. భద్రకాళి దేవాలయ కమాన్, కేఎంసీ ముందు, ములుగురోడ్, ఓ సిటీ, ఖమ్మం రోడ్, లేబర్‌కాలనీ, కాశిబుగ్గ జంక్షన్, పలుప్రాంతాల్లో ఈ కొబ్బరి పువ్వు అమ్మకాలు సాగుతున్నాయి. వీటి ధర ఒక్కో కొబ్బరిపువ్వు సైజును బట్టి రూ. 60 నుంచి రూ.80 వరకు లభిస్తున్నాయి.



కేసీఎం సమీపంలో కొబ్బరిపువ్వు కొనుగోలు చేస్తున్న యువకులు

కేరళ, తమిళనాడు రాష్ట్రాల నుంచి దిగుమతి...

నగరంలో లభిస్తున్న ఈ కొబ్బరిపువ్వు కేరళ రాష్ట్రంలోని మున్నార్, అలిప్పి, కొట్టాయం, తిరువనంతపురం, తమిళనాడులోని కోయంబత్తూర్, ధర్మపురి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి.

ప్రయోజనాలు ఇలా..

- రక్తంలో చెక్కర స్థాయిలను అదుపుచేయడంలో ఇన్సూలెన్ స్రావాన్ని ప్రేరేపించడంలో సహాయపడుతుంది.
- క్యాలరీలు తక్కువగా ఫైబర్ పీచు పదార్థాలు అధికంగా ఉండటంతో బరువు తగ్గేందుకు సహకరిస్తుంది.
- శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- అలసట, నీరసం వంటి సమస్యల్ని దూరం చేస్తుంది.
- కిడ్నీ ఇన్‌ఫెక్షన్స్, కిడ్నీ డ్యామేజ్ వంటి జబ్బులను నివారిస్తుంది.
- ఆంటి ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండడంతో క్యాన్సర్ కారకాలను దరిచేరనీయదు.
- శరీరంలో హార్మోన్‌లెవల్స్‌ని సరిస్థాయిలో ఉంచుతుంది
- చెడు కొవ్వును తగ్గిస్తుంది.
- బీపీ, షుగర్, థైరాయిడ్, వ్యాధులను క్రమబద్ధీకరిస్తుంది
- జుట్టుకు కావాల్సిన పోషకాలను అందిస్తుంది.
- విటమిన్ ఈ, సీ పుష్కలంగా లభ్యం అవుతాయి
- గుండెపోటును నివారిస్తుంది.

టేస్ట్ చేద్దామని కొనుగోలు చేశాం

- ఇటుకాల సాంబయ్య, వరంగల్



నగరంలో చాలా చోట్ల ఈ కొబ్బరిపువ్వు అమ్మకాలు చేస్తున్నారు. ఒకసారి టేస్ట్ చేద్దామని కొనుగోలు చేసి తిన్నాం. చాలా రుచిగా ఉంది. ఆరోగ్యానికి కూడా చాలా మంచదని తెలిసింది. పిల్లలు కూడా ఇష్టంగా తింటున్నారు.

అమ్మకాలు పెరిగాయి....

వెల్ది లావణ్య సతీష్, కొబ్బరిపువ్వు విక్రయదారు



రెండు నెలలుగా కొబ్బరిపువ్వు అమ్మకాలు చేస్తున్నాం. ఇప్పుడు ప్రజలు ఈ కొబ్బరిపువ్వు కొనుగోలుకు ఆసక్తి కనబస్తున్నారు. అమ్మకాలు జోరందుకున్నాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు వ్యాపారం బాగుంది.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ




కాటారం, గాధంపల్లిలో అయోధ్య రాముని అక్షింతలు స్వీకరిస్తున్న గ్రామస్థులు

కాటారం, జనవరి 1: అయోధ్య నుంచి మండలానికి చేరిన శ్రీరామవిగ్రహ ప్రాణప్రతిష్ఠ అక్షింతల పంపిణీ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు జంగ సమ్మయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నరివెద్ది గోపాల్ ఆధ్వర్యంలో అక్షింతలు, కరపత్రాలకు మండల కేంద్రంలోని భక్తాంజనేయస్వామి, ధన్వాడ దత్తాత్రేయస్వామి, ఒడిపిలవంచ వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి పంపిణీ చేశారు. ఈ నెల 15 వరకు అన్ని గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలు అందించే ఏర్పాట్లు చేశామని వీహెచ్‌పీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లం సదయ్య, గద్దల రమేష్, అమర్ పాల్గొన్నారు.

● మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్లతోపాటు గాధంపల్లి, పెద్దతూండ్లలో అయోధ్య రామ అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాధంపల్లి గ్రామంలో అక్షింతలను ఊరేగిస్తూ ఇంటింటికీ అక్షింతలను అందజేశారు. తాడిచర్ల వెంకటేశ్వర ఆలయంలో అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ప్రహ్లాద్‌శర్మ, ఒల్లాల రమేష్, రేపాల ధనుంజేయులు, కుక్కుడపు వెంకటేశ్వర్లు, రేపాల హరీశ్, శ్రీనాథ్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● వాజేడు: మండలంలోని చీకుపల్లి రామాలయానికి చేరుకున్న అయోధ్య రాముని అక్షింతలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తి గేయాలు, భజనలు చేయగా రాముని స్మరణతో చీకుపల్లి మార్మోగింది. అనంతరం గ్రామస్థులకు అక్షింతలను అందించగా భక్తిశ్రద్ధలతో ఇంటికి తీసుకెళ్లారు.

'తపాస్' క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో, తపాస్ నాయకులు

భూపాలపల్లిటౌన్, జనవరి 1: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపాస్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యా శాఖ జిల్లా అధికారి మాట్లాడుతూ జాతీయ భావాజాలం గల సంఘం తపాస్ అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, కార్యదర్శి గంపల స్వామి, నాయకులు రమణారెడ్డి, మనోహర్, దిలీప్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకం వార్షికోత్సవం



డీఎస్‌పీ శిలాఫలకం వద్ద నేతలు

గణపురం, జనవరి 1: ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) నేత విశారధన్ మహరాజ్ పాదయాత్ర సందర్భంగా మండలంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం వార్షిక వేడుకలు ఆ సంఘం నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. శిలాఫలకానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో కండె రవి, స్వామి, విక్రం, పొనగంటి సతీష్, రవి, ఓంకార్, సాగర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఇయర్.. 'ఫుల్' జోష్!

● నూతన సంవత్సర వేడుకల్లో ప్రభుత్వానికి 2.5 కోట్ల ఆదాయం

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 1: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. దీంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. డిసెంబరు 31 సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు సంబంధించిన వైన్స్ షాపుల్లో మొత్తంగా రూ. 3 కోట్ల 60 లక్షల మద్యాన్ని దిగుమతి అయ్యింది. ఒక్క రోజే రూ. 1 కోటి 50 లక్షల మద్యం విక్రయాలు జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా ఒక్క రోజే ప్రభుత్వానికి రూ. 2 కోట్ల 50 లక్షల ఆదాయం సమకూరింది. రెండు జిల్లాల్లో మొత్తం 55 మద్యం దుకాణాలు, మూడు బార్లు ఉండగా ఈ మేరకు ఆదాయం వచ్చిందని అధికారులు చెప్పారు.

పట్టుబడ్డ మందు బాబులు

భూపాలపల్లి జిల్లాలో 42 కేసులు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 1: కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా మందుబాబులపై పోలీసులు ప్రత్యేక నజర్ వేశారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలికేందుకు.. కొత్త సంవత్సరానికి స్వాగతించేందుకు సంబరాలు చేసుకున్న క్రమంలో కొంత మంది యువకులు మద్యం సేవించి వాహనాలు అతివేగంగా నడిపి పోలీసులకు చిక్కారు. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచే ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ చేపట్టగా జిల్లా వ్యాప్తంగా 42 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరంతా కోర్టుకు వెళ్లి ప్రత్యేకంగా రుసుము చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, ఇప్పటికే మద్యం సేవించి పట్టుబడితే రూ. 10వేల జరిమానాతో పాటు ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందనే విషయాన్ని ముందస్తుగానే పోలీసు అధికారులు స్పష్టం చేశారు.

వైభవంగా పుట్ట మల్లన్న బోనాల జాతర



బోనాలతో ప్రదక్షిణ చేస్తున్న మహిళలు, శివసత్తులు

కాటారం, జనవరి 1: మండల కేంద్రమైన కాటారం గ్రామ పంచాయతీ పరిధి సబ్‌స్టేషన్‌పల్లిలో బోనాల జాతర సోమవారం వైభవంగా జరిగింది. మల్లన్న ఆలయం ఎదుట ఒగ్గు కళాకారులు పెద్ద పట్నాలు వేశారు. అనంతరం శివసత్తులు, లక్ష్మీదేవరలు డోలువాయిద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య పూనకాలతో భక్తులకు భవిష్యవాణి వినిపించారు. మహిళలు నైవేద్యంతో కూడిన బోనాలను వండి సాయంత్రం ఆలయ ప్రదక్షిణ చేసి మల్లన్నకు సమర్పించారు. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల జాతరకు పలు గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాచర్ల శ్రీజరాజేందర్, గోనే శ్రీనివాస్, కొట్టె శ్రీహరి, తైనేని సతీష్, జాతర నిర్వాహకులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో అయ్యప్పకు జలాభిషేకం



అయ్యప్ప స్వామికి గోదావరిలో అభిషేకం చేస్తున్న భక్తులు

ఏటూరునాగారం, జనవరి 1: అయ్యప్ప నగర సంకీర్తన, పంబారట్టు మండల కేంద్రంలో సోమవారం వైభవంగా జరిగాయి. అయ్యప్ప దేవాలయంలో స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం నుంచి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. ముల్లెకట్ట వంతెన వద్ద గోదావరి వద్దకు మేళతాళాలు, అయ్యప్ప నామస్మరణల నడుమ చేరుకున్నారు. గోదావరిలో గురు స్వాములు వంగరి గోపి స్వామి ఆధ్వర్యంలో అయ్యప్పకు గంగా స్నానం చేయించారు. స్వామివారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. రకరకాల పండ్ల రసాలు, విభూది, గంధంతో అభిషేకం చేశారు. తిరిగి స్వామివారిని ఆలయంలో ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయ చైర్మన్ బోల్లాసాని గౌరీశంకర్, పర్వతాల లాలయ్య, బోడ సత్యం, దొడ్డ కృష్ణ, చిటమట రమేష్, కునారపు రాములు, కునారపు సత్యనారాయణ, చింతల విజయ్, బట్ట ఉపేందర్, రామిళ్ల గోపి, సాంబయ్యతో పాటు సుమారు 60 మంది అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో సందడి



మల్లూరు ఆలయంలో భక్తులు

మంగపేట, జనవరి 1: మండలంలోని మల్లూరు హేమాచల కొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. ఆంగ్ల కొత్త సంవత్సరం సందర్భంగా మన రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామి, వేణుగోపాలస్వామి, పంచముఖాం జనేయస్వామి, రమ సత్యనారాయణస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించు కున్నారు. కొండపై కొలువై ఉన్న స్వయంభు పుట్టుస్వామిగా వీరాజిల్లుతున్న లక్ష్మీనరసింహస్వామితోపాటు పక్కనే వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు కైంకైర్యం రాఘావాచార్యులు, ముక్కమల్ల రాజశేఖరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఈశ్వర్‌చంద్‌శర్మ, పవన్‌కుమారా చార్యులు, రాజీవ్ నాగశర్మ, వెంకటనారాయణశర్మ ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆలయ ఈవో సత్యనారాయణ, చైర్మన్ నూతలకంటి ముకుందం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాపురం(నూగూరు), జనవరి 1: మండలంలోని ఒంటిమామిడి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చొక్కాల గ్రామానికి చెందిన లక్ష్మీనర్సు టీవీఎస్ ఎక్సెల్‌పై వెంకటాపురం నుంచి వాజేడువైపు వెళ్తున్నాడు. వాజేడు నుంచి వెంకటాపురం మండలం చెరుకూరు గ్రామానికి చెందిన యాలం శ్యామ్ ద్విచక్రవాహనంపై మండల కేంద్రానికి వస్తున్నాడు. ఈక్రమంలో ఒంటిమామిడి గ్రామ సమీపంలోకి చేరుకోగా రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు కాగా గమనించిన స్థానికులు 108వాహనంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉండడంతో పరీక్షించిన వైద్యులు భద్రాచలం వైద్యశాలకు తరలించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

టేకుమట్ల, జనవరి 1: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎస్సారెస్పీ మాజీ చైర్మన్ ఆకుల రవీందర్ మండలంలో సోమవారం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన పలువురు మృతుల కుటుంబాలను పరామర్శించారు. కుందనపల్లి గ్రామానికి చెందిన చింతల రాజయ్య, వెంకట్రావుపల్లి (బి) గ్రామానికి చెందిన గట్టు మధునమ్మ, గుండ మల్లమ్మ, కాసాని రామమ్మ, ఉమ్మనవేని బక్కయ్య, వీరవేని బాలయ్య ఇటీవల మరణించగా వారి కుటుంబాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు రవీందర్ పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం, మండల ఉపాధ్యక్షులు మోతే రాజమౌళి, మాదం కోంరయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు తోడేటి కుమార్, కోశాధికారి శాస్త్రాల కిరణ్, ఆడెపు సంపత్, నాంపెల్లి వీరేశం, సట్ల కోంరయ్య, స్వామిరావు ఉన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

మల్హర్, జనవరి 1 : మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు అన్ని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పాల్గొన్నరు. టపాసులు కాల్చి, కేక్ కట్ చేశారు. మహిళలు వాకిళ్లలో రంగు రంగుల ముగ్గులు వేశారు. తాడిచర్లలోని వెంకటేశ్వర ఆలయంలో అర్చకుడు ప్రహ్లాద్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మేడారంలో కలెక్టర్ పర్యటన



మేడారంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

-మేడారం, జనవరి 1: ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం మేడారంలో పర్యటించారు. మహాజాతర అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. పనుల పురోగతిపై సమీక్షించారు. మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో జాప్యం చేయద్దని ఆదేశించారు. పారిశుధ్య పనులను ముమ్మరం చేసి మేడారం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని డీపీవో వెంకయ్యకు సూచించారు.శానిటేషన్ స్టోర్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పార్కింగ్ స్థలాల పనుల పురోగతిపై ఇంజనీరింగ్, ఎండోమెంట్, ఈజీఎస్ అధికారులతో చర్చించారు. వీజీపీ, వీవీఐపీ, పార్కింగ్ స్థలాల ప్రత్యేక మరమ్మతు పనులను ముమ్మరం చేయాలన్నారు. మేడారంలో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని, పొదలను తొలగించాలని అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో జనవరి 15లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు మొక్కుల కోసం వస్తున్న భక్తులకు సౌకర్యాలు కల్పించారని అన్నారు. పుట్టుపూర్వపు గుడి అయిన బయ్యక్కపేట గ్రామంలో ఉన్న సమ్మక్క ఆలయాన్ని సందర్శించి పూజారులతో మాట్లాడారు. గుడి చుట్టూ పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. చందా వంశీయులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్ మేడారం ఈవో రాజేంద్రం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

లాభాల వైపు సింగరేణి పయనం

• నష్టాలు తగ్గుముఖం పట్టాయి.. • డిసెంబరులో 69 శాతం బొగ్గు ఉత్పత్తి • జీఎం బళ్లారి శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం బళ్లారి శ్రీనివాసరావు

కాకతీయఖని, జనవరి 1: భూపాలపల్లి ఏరియాలో సింగరేణి ఇప్పుడిప్పుడే లాభాల వైపు పయనిస్తోందని జనరల్ మేనేజర్ బళ్లారి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరంతో పోల్చితే ఏరియాలో నష్టాలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ప్రస్తుతం రూ.275 కోట్ల నష్టాల్లో ఉన్నామన్నారు. మిగిలిన మూడు నెలల్లో 10లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తే నష్టాలు పోయి లాభాల చేకూరుతాయని తెలిపారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో బాటమ్ యాష్ సమస్య ఉందని, దీన్ని త్వరలోనే అధిగమిస్తామని అన్నారు. డిసెంబరులో ఏరియాలోని అన్ని గనుల నుంచి 69 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించామన్నారు. కేటీకే-1వ గనికి 29 వేల టన్నుల లక్ష్యం ఉండగా 17,971 టన్నులు ఉత్పత్తి చేసినట్లు తెలిపారు. కేటీకే-5వ గనికి 35 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 16,546 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు చెప్పారు. కేటీకే-6వ గనికి 21 వేల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 8,921 టన్నులు, కేటీకే-8వ గనికి 41 వేల టన్నుల బొగ్గు లక్ష్యాన్ని నిర్దేశం చగా 14,589 టన్నులు, ఓపెన్ కాస్టు ప్రాజెక్ట్-2కు 1 లక్ష 60 వేల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా 1,28,249 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించిందన్నారు. ఓసీ-3కి 2 లక్షల టన్నుల బొగ్గు లక్ష్యాన్ని నిర్దేశించగా 1,48,337 టన్నుల బొగ్గు ఉత్పత్తిని సాధించినట్టు చెప్పారు.

మరో 55 మంది కార్మికులు డిస్మిస్‌కు సిద్ధం

భూపాలపల్లి ఏరియాలోని సింగరేణి కార్మికులు 2022 జూలైలో 48 మంది విధుల నుంచి డిస్మిస్ అయ్యారని జీఎం శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం మరో 55 మంది కార్మికులు డిస్మిస్ కానున్నారని చెప్పారు. విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. గైర్హాజరు కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఇప్పటికే మూడుసార్లు కౌన్సెలింగ్ చేసినట్టు తెలిపారు. అయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా కార్మికులు విధులు సక్రమంగా నిర్వహించి సంస్థ అభివృద్ధికి, కుటుంబానికి అండగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో అధికారులు జ్యోతి, అజ్మీరా తుకారాం, గణేష్, ఉత్తమ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తిలో అట్టడుగున భూపాలపల్లి

బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి భూపాలపల్లి ఏరియా అట్టడుగు స్థానంలో ఉంది. సింగంణి వ్యాప్తంగా బెలంపల్లి ఏరియా 139 శాతం సాధించి మొదటి స్థానంలో ఉంది. 107 శాతంతో రామగుండం (ఆర్జీ)-2 రెండో స్థానం, 105 శాతం సాధించి మణుగూరు మూడో స్థానం, 102 శాతంతో ఏపీఏ నాలుగో స్థానం, 98 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించి ఇల్లందు ఐదో స్థానంలో ఉంది. 95శాతంతో ఆర్జీ-1, 2లు ఆరో స్థానంలో నిలిచింది. 91శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిన శ్రీరాంపూర్ ఏరియా ఏడో స్థానంలో నిలవగా 89శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిన మందమర్రి ఏరియా ఎనిమిదో స్థానంలో ఉంది. 72 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించిన కొత్తగూడెం ఏరియా తొమ్మిదో స్థానంలో నిలిచింది. భూపాలపల్లి ఏరియా 69శాతం బొగ్గు ఉత్పత్తి సాధించి అట్టడుగు స్థానంలో ఉంది.

బొల్లారంలో కార్డన్‌సెర్చ్



బొల్లారంలో గ్రామస్థులతో వాజేడు పోలీసులు

వాజేడు, జనవరి 1: మండలంలోని మారుమూల గ్రామమైన బొల్లారంలో సోమవారం వాజేడు ఎస్సై సి.హెచ్.వెంకటేశ్వరరావు కార్డన్‌సెర్చ్‌ను నిర్వహించారు. వేకువజామున గ్రామంలోని సీఆర్పీఎఫ్ దళాలతో ప్రవేశించిన పోలీసులు ప్రతి ఇంటినీ సోదా చేశారు. కొత్తగా వచ్చిన వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆధార్ కార్డులను పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఎస్సై గ్రామస్థులతో మాట్లాడుతూ అసాంఘిక శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని సూచించారు. గ్రామంలోని అనుమానాస్పద వ్యక్తులు ఎవరూ తారస పడ్డా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నిశ్చితార్థం జరిగిన పదిరోజులకే..

వేధింపులు తట్టుకోలేక యువతి ఆత్మహత్య

ఫోన్‌లో మాట్లాడినందుకు అనుమానించిన యువకుడు

జనగామ జిల్లా ఇప్పగూడెంలో ఘటన



లింగనబోయిన వసంత (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 1: నిశ్చితార్థం జరిగిన పదిరోజులకే ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. యువకుడి వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడింది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన లింగనబోయిన సోమయ్యసుజాత దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉండగా పెద్ద కుమార్తె అయిన లింగనబోయిన వసంత (19) ఘన్‌పూర్ మోడల్‌స్కూల్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమెకు గత నెలలో రఘునాథపల్లి మండలం గబ్బెట గ్రామానికి చెందిన నర్సింగుల హరీష్ అనే యువకుడితో వివాహం నిశ్చయించారు. డిసెంబరు 22వ తేదీన పెద్ద మనుషుల సమక్షంలో నిశ్చితార్థం చేశారు. కట్నం కింద రూ.20వేలు అందించారు. ఈ క్రమంలో డిసెంబరు 31న అర్ధరాత్రి 2గంటల ప్రాంతంలో హరీష్ తన స్నేహితుడితో కలిసి వసంత ఇంటికి వచ్చాడు. వసంత తండ్రిని నిద్రలేపి మీ కూతురును పిలువమని చెప్పడంతో వసంత లేచి బయటకు వచ్చింది. ఆమెతో కొంత సమయం మాట్లాడిన హరీష్ 'మీ కూతురు రోజూ ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతోంది, నేను ఆమెను వివాహం చేసుకోను, మీరు కట్నం కింద ఇచ్చిన రూ.20వేలకు అదనంగా మరో రూ.20వేలు కలిపి ఇస్తాను' అని తండ్రి సోమయ్యకు చెప్పాడు. దీంతో ఆయన 'రాత్రి వేళ ఇంటికి వచ్చి ఇలా మాట్లాడితే ఎలా.. రేపు ఉదయం పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందాం' అని సర్ది చెప్పినప్పటికీ వినకుండా వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన వసంత సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మధ్యాహ్నం ఇంటికి వచ్చిన చెల్లెలు కావ్య ఫ్యాన్‌కు వేలాడుతున్న అక్కను చూసి బోరున విలపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. తండ్రి సోమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ సట్ల రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.